# వధూవరుల నాటకం

గుంటూరు.

శ్రీ వెంకటరంగంగారికి :

మీతో నాకు పరిచయం లేదు. నేను అగ్రహారములో వుంటున్నాను. నా పేరు సుందరశివం. అపరిచయస్థులైనా మీకు ఈ లేఖ వ్రాయటం వింతగానే వుంటుంది. కాని అవసరం వచ్చింది కనుక, చనువు తీసుకుని వ్రాస్తున్నాను. చనువు మీరు కూడా పుచ్చుకుని సమానముగా నన్ను తలంచగలరని ఆశిస్తున్నాను.

వుత్తరం వ్రాయటానికి ప్రధాన విషయం వుంది. అది కేవలం నా విషయం కాదు. నన్ను గురించి అయితే బాధపడను. కానీ అవివాహితురాలయిన మా అమ్మాయి విషయం కావటాన చాలా బాధగా మీకు వ్రాస్తున్నాను. ఆడపిల్ల తల్లితండ్రులు ఎన్ని బాధలకులోను కావలసి వస్తుందో ఆడపిల్లల్ని కలిగి వుంటేనేగాని తెలీదు. ఆడపిల్లతో ఇంటికి కళ వచ్చిందని ఆనాడు ఉర్రూతలూగుతాం. మురిపాలు, ముచ్చట్లు చేసుకుని ఆనందిస్తాం. కానీ వయస్సుమీరిన తరువాత మనకు కలిగే బాధలు, దిగుళ్ళు, ఇంతా అంతా కావు. బహుశః మీకూ ఓ అమ్మాయి వుండి వుంటుందని తలుస్తున్నాను. అది నిజమయితే, వీటినిగురించి మీకు వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను. ఎందుకంటే లోకములో అవివాహిత కుమార్తెను గలిగిన తల్లిదండ్రుల ఇక్కట్లు అందరికీ సమమే కాబట్టి.

ఈ సంవత్సరం మా అమ్మాయిని కాలేజీలో చేర్పించాను. నేనూ అంతగా వున్నవాడ్ని కాదు. కట్నాలు కానుకలూ ఇచ్చుకోలేనందున బి. ఏ., వరకు చదువైనా అమ్మాయికి చెప్పించకల్గితే ఏ పుణ్యాత్ముడినో అడగవచ్చని అనుకుంటున్నాను. కాలమూ, దైవమూ కలసివస్తే నా కోరిక నెరవేరి మా అమ్మాయి చక్కగా బతుకుతుందని ఆశిస్తున్నాను. కానీ మూడు నెలలయిందో కాలేదో కాలేజీలో చేరి, కొన్ని విషయాలు జరుగుతున్నాయి. చూడబోతే, గతరెండు మాసాలబట్టి జరుగుతున్నట్టు తోస్తూంది. కాలేజీ దారిలో కొంతమంది మగపిల్లలు, ఆడపిల్లలు దాన్ని ఏడిపిస్తున్నట్లు వింటున్నాను. మా అమ్మాయిని ఈ మధ్య ఒక విద్యార్థి కొంచెం గొడవ చేస్తున్నట్లు మా అమ్మాయే చెప్పింది. వాకబు చెయ్యగా ఒక విషయం తెలిసింది. తమరికి కోపం రానట్టయితే, మరేమీఅనుకోకుండా వుంటే ఆ విషయం మనవి చేస్తాను. ఆ కుర్రవాడు తెలీక చేసి వుండవచ్చును. అందుకు నేను కోపగించుకోవడం లేదు. అతను తమరి అబ్బాయి అన్నట్లు తెలిసింది. ఆడపిల్ల తండ్రిని అడుగుతున్నాను. వివాహమై వెళ్ళిపోవాల్సిన అమ్మాయి కాబట్టి ఎటువంటి మచ్చలూ వుండకూడదు. మీ అబ్బాయిని కాస్త దండిస్తారని ఆశిస్తాను. చనువు తీసుకుని వున్న సంగతి వ్రాశాను. మన్నిస్తారని అనుకుంటూ,

ఇట్లు :

సుందరశివం.

గుంటూరు.

శ్రీ సుందరశివంగారికి :

మొన్న మీరు వ్రాసిన కవరు అందినది. దానిలోని విషయాలు గ్రహించాను. మీరు

## కొంపల్లి బ్రహ్మానందరావు

వ్రాసిన విషయం చదవగానే కోపంవచ్చిన మాట వాస్తవం. ఆశ్చర్యం, వింత కూడా కలిగింది. తమరు అనుకున్నట్లు మా వాడు పోకిరి వాడు కాదు. తుంటరి చేష్టలు వాడికి లేవు. మీ అమ్మాయిని గోల చేశాడంటే నమ్మలేకుండా వున్నాను. మా అబ్బాయి శ్రద్ధగా చదువుకుంటూ రెగ్యులర్ గా కాలేజికి వెళ్ళేవాడు కానీ, చెడుగా తిరుగుతూ ఆడపిల్లలను గేలిచేసేవాడు కాదు. ఆ సంగతి ఖచ్చితంగా చెప్తున్నాను. మీ అమ్మాయి మరెవరినిగురించో చెప్పివుంటుంది మీరు పొరబడి మా వాడ్నిగా తలంచి వుంటావు. ఆడపిల్ల తల్లితండ్రుల బాధలు గ్రహించిన వాడినే కాబట్టి, చనువు తీసుకుని నన్ను అడిగినందుకు, నేను మరేమీ అనుకోను. మీ అమ్మాయిని అల్లరిచేస్తూన్నవాడు మా అబ్బాయి కాదని మరొకసారి రూఢిగా తెల్పుతున్నాను.

ఇట్లు :

వెంకటరంగం

గుంటూరు.

శ్రీ వెంకటరంగంగారికి :

ఈ రోజే తమరి జాబు చూచుకున్నాను. సంగతులు చదివి కొంచెం ఆశ్చర్యం పడినమాట వాస్తవం. నేను తొందరపడి ఒకరిమీద నిందవేసేవాడ్ని కాదు. బహు జాగ్రత్తగల మనిషిని. ఈ విషయం ఎవర్నయినా అడిగి తెల్సుకోవచ్చును. నిదానం నెమ్మది, ఓర్పుగల వాడినిగా మా మిత్రులు అంటూ వుంటారని గర్వముగా చెపుతున్నాను. అందుచేత మొన్న నేను వ్రాశిన విషయం చాలా రూఢిగా తెల్సుకున్న తర్వాతనే మీకు వ్రాశాను. గట్టి నమ్మకం లేనిదే మీలాంటి పెద్దమనుషులకు సాహసించి వుత్తరం వ్రాయగలనా?!! కుర్రవాడు ఫలానావారి అబ్బాయని నాకు నమ్మకముగా తెల్సును. మీ జవాబు చూచుకున్న తర్వాత తిరిగి మా అమ్మాయిని వివరముగా అడిగాను. అది కూడా తమరి లేఖను చదువుకుని నవ్వుకుంటూ నాకు బాగా తెల్సునన్నగారు. అబ్బాయి వీరి అబ్బాయే అని, చెప్పింది. ఇందులో అబద్ధం ఏమాత్రం లేదు. కనుక అబ్బాయిని కాస్త అదుపు ఆజ్ఞలో వుంచుతారని ఆశిస్తున్నాను.

చనువుతోనే మీకు వ్రాస్తున్నట్టు గ్రహించారనుకుంటాను.

ఇట్లు :

సుందరశివం,

గుంటూరు.

శ్రీ సుందరశివంగారికి :

పనుండి విజయవాడ వెళ్ళి ఈ రోజునే వచ్చాను. మావాళ్ళు మీరు వ్రాసిన కవరు ఇపుడే ఇచ్చారు. మీలాగే నేనూ జాబును చూసి ఆశ్చర్యపోయాను. మా అబ్బాయి మీరు అనుకున్నట్టు ఆడవాళ్ళని గేలిచేసేవాడు ఎన్నటికీ కాడు. స్వభావాలు, గుణాలు తరతరాలనుంచి అలవడతాయి కనుక, మా కుర్రవాడు చాలా గుణవంతుడు. చెడుగా తిరిగేవాడు కాదు. అల్లరిపిల్లల స్నేహం లేదు. అయినా ఎందుకయినా మంచిదని ఆఫీసు రూములో కూర్చుని శ్రద్ధగా చదువుకుంటూన్న మా రామాన్ని పిలిచి ఈ విషయం అడిగాను. వాడు నవ్వుకుంటూ "నాన్నా ఇన్నాళ్ళబట్టి చూస్తున్నావు! ఈ మాదిరి రిపోర్టులు నామీద ఎప్పుడయినా వచ్చాయా ఇదంతా అబద్ధం. కేవలం నిందమోపడం గాని, వేరేమీ లేదు. అసలు నా చదువేమిటో నేను చూచుకుండేవాడ్ని గానీ, కనీసం ఆడవాళ్ల కాలేజివీధి మలుపుకూడా

ఎన్నడూ తిరగలేదు.

మీరు చెప్తూన్న ఆ అమ్మాయి నాకసలు తెలీదు, అని చెప్పాడు. ఏమీ తెలీనివాడ్ని అనవసరముగా అడిగినందుకు నేనూ ఎంతో బాధపడ్డాను. అభాండాలు వేసేముందు ఆలోచించాలని మీకు మరోకసారి చెప్తున్నాను. మరోకసంగతి ఒకవేళ వేరొకరి పిల్లవాడు గొడవచేసినప్పటికీ, అదుపాజ్ఞలలో వుంచాల్సింది మీ ఆడపిల్లనుగానీ, పిల్లవాడ్ని కాదు. ఇది ముఖ్యంగా గ్రహించాలి.

మీ అమ్మాయికీ మా అబ్బాయికి ఎటువంటి సంబంధమూ లేదు.

ఇట్లు,
వెంకటరంగం.
గుంటూరు,

శ్రీ వెంకటరంగంగారికి :

తమరి జాబు అందినది. మా అమ్మాయిని అదుపాజ్ఞల్లో వుంచుకోవాలనే విషయం నేనూ ఒప్పుకుంటాను. మా శారదని కోప్పడిన తర్వాతనే ఈ విషయం మీ దాకా తెచ్చాను. "రోజూ వెంటబడి గొడవచేసి ఏడిపిస్తూంటే నేనుమాత్రం ఏం చేస్తాను నాన్నా!" అంది. పోనీ కాలేజీ మానిపిద్దామంటే, సగంలో ఒదిలేస్తే డబ్బుకు డబ్బూ వృథా అవుతుంది. పెళ్లి కావలసిన పిల్లకు చదువూ వుండదు. చదువులేనిదే ఈ రోజుల్లో ఏ పిల్లవాడూ ముందుకు రాడు. అప్పటికీ రెండు రోజులు కాలేజి మానెయ్యమన్నాను. కాని ఏమి ప్రయోజనం? మూడోరోజునుంచి యథాప్రకారం వెంటవస్తున్నాడట. మా అమ్మాయికి మీ జాబు చూపించాను. పోనీ పొరపాటుపడి వుంటావు. సరిగా కనుక్కోవే అన్నాను. మా పనికుర్రవాడ్ని పంపించి అతని ఇల్లూ అది కనుక్కోమని చెప్పిందట. అతను మీ ఇంట్లోకే వెళ్లాడట. బయట ఎవరో్న అడిగితే ఆ అబ్బాయిగారు మీవాడేనని తెల్సింది. ఆ తరువాతే మా అమ్మాయి నాకు చెప్పింది. ఇంక ఆ కుర్రవాడు మీవాడేనని అంతకన్నా రుజావు కావాలా?

మరోకవిషయం. మా అమ్మాయి 'వర్షన్' ప్రకారం ఓరోజున కాలేజికి వెళ్తూంటే కాన్వెంటు దగ్గర వెనకాలే ఓ కుర్రవాడు సైకిల్ మీదవస్తూ మా అమ్మాయికి కావాలని 'డేష్' కొట్టబోయి, తనే క్రిందపడినట్టు, అందుకు మా అమ్మాయి ఎగతాళిగా నవ్వటం జరిగినందున అతనికి హేళనజరిగినట్టు భావించి కోపావేశాలు ఆవహించినట్టు అప్పటి లగాయతూ మా అమ్మాయిమీద కసి బూనినటూ తెలుస్తోంది. కావాలంటే ఈ విషయం మీ రామాన్నడిగి రూఢి పర్చుకోవచ్చు.

జరిగిన సంఘటనకు చేసేదేమీ లేదు కనుక, ఇకనుంచయినా దయవుంచి మీవాడ్ని మా అమ్మాయిజోలికి రావద్దని హెచ్చరిస్తారని తలుస్తాను.

ఇట్లు,
సుందరశివం.
గుంటూరు.

శ్రీ సుందర శివంగారికి:

నిన్న మీరువాశిన వుత్తరములో కూడ దోషం అంతా మారామం మీదనే పెట్టి ఏదో మీ అమ్మాయి చాలా మంచిదన్నట్టు చెప్పుకున్నారు. చాలా సంతోషం! మగపిల్లలనేకంటే మీ అమ్మాయిని దండించమని మరోసారి హెచ్చరిస్తున్నాను. మావాడు సైకిలు 'ఢీ' కొట్టాలని ప్రయత్నించడం క్రిందపడ్డాడనడం ఇదంతా కేవలం కట్టుకథగా కనిపిస్తోంది. నాన్నా నాకు క్లాసు తప్పకుండా వస్తుందని, చాలా బాగా చదువుతున్నానని మారామం పదే పదే నాతో చెప్తూంటే ఈ గొడవలు ఈ అల్లర్లు చేసేందుకు టైము ఎక్కడ వుంటుందో అనూహ్యం. అపవాదులు, నిందలు వెయ్యటమే కాని ఆలోచనలేకుండా ప్రవర్తిస్తున్నారు. మేడమీద గదిఇచ్చి, చక్కగా చదువుకోమని మావాడికి ఈనాడు చెప్పటం కాదు. గత రెండేళ్ళపైగా వాడి బాధ్యత వాడు గ్రహించి శ్రద్ధగాచదువు కుంటూంటే వాడిపైన ఈ అభాండం వెయ్యటం ఇకా చాలించమని, అలాగాకుండా ఇది ఈ మాదిరే కొనసాగితే, పరువునష్టం దావా వేసి, నష్టపరిహారము క్రింద పదివేలు రాబట్టగలనని


మనోహరమైన కేశములకు సులభమైన కిటుకు

తాతావారి
సుగంధిత కొబ్బరి తలనూనె
మరియు షాంపూ



ది తాతా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్.

# ★ వధూవరుల నాటకం ★

ఇందు మూలముగా మీకు తెలియజేస్తున్నాను.

వయస్సువచ్చిన కొడుకును ఆడపిల్లను గురించి ఇన్నిసార్లు అడగటం నాకు డెలికేటుగా వున్నందున మీకటుకథలను గురించి మరొకసారి అడగ తల్చుకోలేదు.

ఇట్లు
వెంకటరంగం
గుంటూరు.

శ్రీ వెంకటరంగం గారికి:

మీ తీవ్రమైన లేఖ అందినది. ఈనాటి పిల్లలుచేస్తూన్న కార్యకలాపాలుగాని, వారి తెలివి తేటలుగాని పరికిస్తూంటే రోజులు ఎంతగా మారాయో విశదమవుతోంది. అమోఘమైన ఆలోచనలు, తీపికబుర్లు అనుమానం కల్గించని అబద్ధాలు, జాలీ, దయ పుట్టించే ముఖాలూ మనల్ని బుట్టలో వేసుకుంటున్నాయి. ఇంతకీ విన్న జరిగినసంగతి వ్రాస్తే మీరుకూడా నాతో ఏకీభవిసారు. ఏదో మంచిఇంగ్లీషు పిక్చరు వుందంటే అలా క్లబ్బునుంచి స్నేహితులం నల్గురమూకలసి థియేటరుకు వెళ్ళాం. వదిలిపెట్టినతరువాత వస్తూంటే మా అమ్మాయి కన్పించింది. వాళ్ళ స్నేహితురాళ్ళతో వచ్చిందనుకున్నాను. తీరా వెనకాత్తే ఓ యువకుడు వస్తున్నాడు. నాకు అనుమానమూ, ఆగ్రహం వేసింది. నేనే అడగబోతూంటే, క్షమించండి నాన్నగారూ ఇంట్లో అన్నీ సవివరముగా చెప్తాను—" అంది.

ఇంటికిరాగానే చాలా కోపంగా అడిగాను. మా అమ్మాయిమీద అంతకోపం ఎన్నడూ రాలేదు. ఆ అబ్బాయి ఎవరో కాదని, వెంకటరంగం గారబ్బాయి రామం అని, తమిద్దరూ ప్రేమించుకున్నామని చెప్పింది. మరి ఇన్నాళ్లు ఎందుకు చెప్పలేదు? అని అడిగాను. వివాహానికి అంగీకరించరేమోనని కొంత అడావుడి, హంగామాలు జరిగితే అడ్డువుండదేమోనని ఇద్దరూ కలిసే ఈనాటకం ఆడారని తెల్పింది. మొదట్లో దాన్ని చాలా కోప్పడినా, ఇంక అయిందేదో అయిపోయిందని శాంతించాను. మీ రామం, మా అమ్మాయితో మా ఇంటికివచ్చాడు. నిజమా నాయినా అని అడిగాను. అంతా నిజమన్నట్లు నవ్వుతూ చెప్పి ఈ విషయం తమకివ్రాసి ఎలాగయినా వివాహానికి ఒప్పించమని వేడుకున్నాడు.

వెంకటరంగంగారూ, అందుచేత ఇపుడు జరగవలసిన కార్యక్రమం ఏమిటి? ఆలోచిస్తే వివాహం చెయ్యటమే మేలుగావుంది. ఏమంటారు?

ప్రేమించుకున్న వారిని ఇద్దర్ని విడదీయటం ప్రమాదం. ఆసంగతి ఒప్పుకుంటారనుకుంటాను. ఒక్కత్తే అమ్మాయి కాబట్టి, వివాహం కూడా వైభవంగా చెయ్యాలని తలంపు. అందులో తమ బోటి వారితో సంబంధం అంటే నా అదృష్టం కూడా. ఇంతకూ నా అభిప్రాయం వివాహం చేస్తే బాగుంటుందని. పరువునష్టం క్రిందపరిహారం మీరడిగిన పదివేలూ, వరకట్నం క్రింద దీంతోనే చెక్కుగా పంపిస్తున్నాను. నామీద దయవుంచి స్వీకరిస్తారని తలుస్తాను.

అనవసరముగా, అభాండాలు, అపనిందలూ ఆలోచనలేకుండా, ఇంతకు పూర్వం వ్రాసిన వుత్తరాలలో నిందించినందుకు క్షమించమని వేడుకుంటున్నాను.

అనుకూలమైన జవాబుకు ఎదురుచూస్తూ,

ఇట్లు మీ
సుందర శివం.

సుందరశివంగారికి:

మీ జాబును చూపించి మావాడ్ని నిలదీసి అడిగాను. అంతా నిజమేనని ఒప్పుకున్నాడు. ఆసంగతి మొదట్లో చెప్పివుంటే ఎంతో బాగుండేది. వివాహం జరిపించివుండేవాడ్నికదా అంటే, సిగ్గుపడ్డానన్నాడు. పోనీలెండి. నాదిగు లేమిటయ్యా అంటే పోస్టు ఖర్చుల క్రింద చాలా పోయిందేఅని! ఏమంటారు?

గత రాత్రి రామం ఇంట్లో కన్పించలేదు. గదిలో లైటు మాత్రం వేసేవుంది. ఇలాచదువుతున్నాడని ఇపుడు అర్థమయింది. ఇంకా శ్రద్ధగా చదువుకుంటున్నాడనుకున్నా.

వరకట్నం క్రిందపంపిన నష్టపరిహారపు చెక్కుని చెరొక ఐదువేలు పెళ్ళికానుకల క్రిందమీరే వధూవరులకు ఇచ్చి దీవించండి.

ముఖాముఖి రేపే కల్సుకుని శుభముహూర్తం నిర్ణయిద్దాం.

ఇట్లు
వెంకట రంగం.

★




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేదిలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశిగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

నంజనగూడు పండ్రపాదివారి
జ్వరేగ్
సకల జ్వరములను అద్భుతముగా నివారించును.
క్యాటలాగ్ ఉచితము
హోల్ ఏజంట్లు యునైటెడ్ కన్సర్న్, మదరాసు-1.
బ్రాంచీలు: హైదరాబాదు & విజయవాడ.

## అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్ - 2.
(దక్కన్)